ఫ్రీవెర్స్‌లో కథ:

హృదయం దొరికింది

—శీలావీర్రాజు

నిశాదేవి నిద్రలో తొలగి వేలాడుతోన్న తెల్లని పట్టుపవిటలా వెన్నెల.
పసిపాప చూపులా తెల్లగా, ప్రియురాలి ప్రేమలా చల్లగా
మనసులో ఉల్లాసాన్ని ఉత్తేజాన్ని కురిపిస్తోన్న వెన్నెల.
ఆ వర్షం నీటిలో కోరికల కాగితపు పడవల్ని వదిలి
వాటివెనకనే చిన్న పిల్లల్లా మేం ముగ్గురం.
ఒకరు—వెన్నెల మడతల్లో చిక్కుకుని ఊపిరి సలపని రాజు.
మరొకరు—వెన్నెల పవిటను వింజామరంచేసి జ్ఞాపకాల్ని రాజేస్తున్న పాణి.
నేను—ఉల్లాసం జల్లులో తడిసి చలికి వణుకుతున్న వాడ్ని.
ముగ్గురమూ మరో అరవై మందితో అజంతా, ఎల్లోరాలకు బయలుదేరిన వాళ్ళం.
పిల్లలూ, వారికి కాపలాగా టీచర్లూ, వాళ్ళ మిత్రులూ, బంధువులూ అరవైమంది.
అజంతా, ఎల్లోరా కళా మండపాల్లో విహరిద్దామని
అక్కడి రాళ్ళలో నిద్రపోతోన్న హృదయాలను తట్టి లేపుదామని
ఓ చలికాలం పాతకాలం బస్సులో బయలుదేరాం.
పాణి ఆ స్కూల్లో ఉపాధ్యాయుడు. మాకు ఆప్తుడు.
అతని తరఫున వచ్చిన వాళ్ళం నేనూ, రాజూ.
మా అజంతా యాత్రలో తొలిరాత్రి మజిలీ చిరాగ్‌పల్లి.
ఊరిచివర నిశ్శబ్దపు తోటలో ఒంటరిగా నిద్రపోతోన్న స్కూల్లో మాపడక.
ఆడాళ్ళు అవతలి వరండాలో, మగాళ్ళు యివతల.

బయట నరాల్ని పగ్గాల్లా పట్టి బిగించే చలి.
మా చుట్టూ విశాలంగా విస్తరించిన చలి బీళ్ళమధ్య
ఒకవైపు దూరంగా వెన్నెల పవిటకు అంచులా నిద్రపోతోన్న ఊరు.

మరోవైపు తెల్లని గులాబీపువ్వులా ఆకాశంలో విరిసిన చంద్రుడు.
రాల్చిన పుప్పొడి కుప్పలా తెల్లగా మెరుస్తోన్న యిసుక పర్ర.

పట్టణంలో వెన్నెలకి మొహంవాచిన వాళ్ళం మేం ముగ్గురం.
నియాన్, మెర్క్యురీ లైట్లే మాకు వెన్నెల్ని ప్రసాదిస్తాయక్కడ.
అడుగడుగునా పోలీసు జవానుల్లా నుంచున్న ఎలక్ట్రిక్ దీపాలు
ఊళ్ళోకి ఏమాత్రం వెన్నెల ప్రవేశాన్ని సహించలేవు.
ఎక్కడైనా, నిద్రపోతోన్న జవానుదగ్గర జాలిగా కాస్తంత వెన్నెల వాలితే
చిరిగిన నేతచీరకు జరీగుడ్డ మాసికలా వుంటుందక్కడ.
వెనకెప్పుడో చిన్నప్పుడువెన్నెల్ని చిమ్ముకుని ఆడుకున్నాం.
మా నీడల్ని మేమే తరుముకొని పరుగులుతీశాం.
అప్పుడు వెన్నెల నిశాదేవి జార్చిన పవిటకాదు మాకు.
మా మీద దయగా మామామ చందమామ కురిపించిన వాత్సల్యపు వర్షం అది.
ఆ వర్షపు నీటిలోనే ఎప్పుడో బాల్యం కొట్టుకొని పోయింది.
యౌవ్వనం గాలులకు ఈ నగరపు ఒడ్డుపట్టి ఆగింది.
ఇక్కడ మాకు వెన్నెల అప్పుడప్పుడు సినిమాలో దొరుకుతుంది.
తెరమీదనే తప్ప ఒంటి మీద వాలదది.
అయినా ఆహా అని మురిసిపోవడం కద్దుమాకు.
నకిలీ అందాలకు అంగడినిండా అన్నీ సంబరాలే యిక్కడ.
అవే కొనుక్కుంటాం, అనుభవాల్లో నింపుకుంటాం.
ఇప్పటికిక్కడ యింతకాలానికి అసలైన వెన్నెల!
(ఆ వెన్నెల్లో మళ్ళీ పసిపాపల్లా పరుగెత్తాలన్న కోరిక)
మఫ్లర్లూ, రగ్గులూ చుట్టుకొని వెన్నెల్లోనడుస్తూ మేం.

నిద్రపోతున్న కొండచిలువలాంటి తారురోడ్డుదాటి
విశాలమైన మైదానంలోకి మా నీడల్ని మేమే తోలుకొనిపోయి
ఓ చెట్టు మొదల్లో నీడల్ని కట్టేసి కూర్చున్నాం.
వెన్నెల పవిటలో వెలుగు నీడల అల్లికాన్ని చూస్తున్నాన్నేను.
దూరంగా వెన్నెలపవిట ఆవల కొండ శిఖరాల్ని వెతుకుతున్నాడు పాణి.
రాజు నిశ్శబ్దాన్ని రాగాలతో నింపుతున్నాడు.

పిళ్ళారిగీతాలూ, అష్టపదులూ పాడుతున్నాడు.
అసలే సంగీతం సన్నని నాజూకైన పూలతీగ.
అష్టపదుల్లో సంగీతం మరీ మృదువుగాసాగి చుట్టుకున్న వలపుతీగ.
హృదయంలోని మార్దవమే దానికి పందిరి.
ఆ పందిరి లేందే అది ఏపుగా విస్తరించి పెరుగదు.
రాజు మనసు ఉల్లిపొర కాగితంకన్న పల్చన.
అనుభవాల చిరుగాలులకు సైతం పులకరించేంత సన్నన.
అందుకే అతను సంగీతంతో మామీద పందిరి వేశాడు.
ఎన్నో చక్కటి సంగతులపూలు పూయించాడు.
మా చుట్టూ పరిమళాల వలయాలు తిప్పాడు.
మా మనసులు ఉల్లాసంతో ఊయలలూగి
మా కళ్ళలో కలల మత్తుతెరలు వాలి
మాకు తెలీకుండా కదిలిపోయింది కాలం.
మాదగ్గరే కట్టేసుకున్న నీడలు అల్లంత దూరానికి పారిపోతే
వాటిని విప్పుకొని తోలుకొపూబయలుదేరాం.
గుచ్చుకొంటున్న చలి ముళ్ళను దాటుకొంటూ
గబగబా ముందుకుపోతున్న రాజు.
పెళ్ళయిన కొత్తలో అనేకసార్లు భార్యపవిట కప్పుకొని
హాయిగా నిద్రపోయిన అనుభవం జ్ఞాపకాల్ని ఏరుకొంటూ వెనకబడిపోయిన పాణి.
ఈ వెన్నెల రాత్రి అనుభవాన్ని అక్షరాల్లో పొదిగి
చక్కటి ప్రేమ కథ చెక్కాలన్న ఆలోచనల మధ్య మెల్లగా నేను.

రాజుని కథా నాయకుడ్నిచేసి రాయాలన్న కథకు
మనసు కాగితం మీద రఫ్ స్కెచ్ గీస్తూ
ఏ అలంకార ఆభరణాలు తగిలించి
ఏ వర్ణనల బట్టలు తొడిగి
ఏ శైలి వాహనంమీద ఊరేగించాలా అని
ఆలోచనల్లోకి తొంగి చూస్తుండగా
అకస్మాత్తుగా రాజు పిలుపు.
పాదాలముందు పామేమోనని ఆతృతగా నేనూ

పాదాల్లో ముళ్లేమోనని కంగారుగా పాణీ.
కాని—
రాజుముఖంలో భయం భృకుటిముడితేగా, బాధల రేఖలులేవు
చిరునవ్వుల పూలదండవుంది. తెల్లటి కాంతివుంది.

మా ముఖాల్లో వేలాడుతోన్న ప్రశ్నల్ని తుడిచేస్తున్నట్టుగా రాజు—
"ఇదిగో! ఇక్కడెవరో హృదయాన్ని పారేసుకున్నారు రండి.
పచ్చగడ్డిలో హాయిగా పవ్వళిస్తోంది యిలాచూడండి.
ఎంత నాజూకుగా నిద్రపోతున్నదో మిత్రమా చూడు
ఏ సుందరాంగి పోగొట్టుకున్నదో దీన్ని పాపం
అయ్యో! మంచులో తడిసి, అంచులు వాడి
ముఖం వెలవెలపోయి గజగజా చలికి వణికిపోతున్నదే యిది
దీన్నిలా నిర్దయగా వదిలేయడం ధర్మం కాదు మనకు"
మెల్లగా వంగి తీసుకుని అరచేతిలో నిలుపుకుని
అరనిముషంసేపు కళ్ళల్లో దాని ప్రతిబింబాల్ని ప్రతిష్ఠించుకుని
మత్తుగా వాల్చిన కనురెప్పల వెనక దాచుకొని
ఆ చుట్టూ తిరుగుతున్న ఆలోచనల తుమ్మెదల్ని తోలుతూ కళ్ళు తెరచి—
"చెప్పండి, ఈ గులాబీ ఎవరి హృదయానికో సాక్షికాదూ.
నా పాట వినవచ్చిన ఏ కోమలాంగిరాకనో తెల్పడం లేదూ.
నిజం, ఏ అమ్మాయో యిటుగా వచ్చివుండాలి.
చలికి ముసుగు సరిచేసుకోవడంలో యిది జారివుండాలి!
—అన్న రాజు మాటల్లో ఎంత తీపి!
అతని ఆలోచనల్లో ఎంత ఆశ!!

కల్పన నిజంగా నిజంకన్న అందమైనది.
మనిషి సంపాదించుకున్న గొప్ప వరం అది.
చేదులాంటి నిజంచెప్పి రాజును గాయపరచడం దేనికి?
అతని సంతోషపు పొంగుమీద చన్నీళ్ళ చిలకరింపు ఎందుకు?
మీకు చెప్తాను కానీ రాజుకు చెప్పకండి
అబద్ధాన్నే అతన్ని గట్టిగా నమ్మనివ్వండి.

ఆ గులాబీ ఎవరి తలలోంచీ జారిపడలేదు.
అంతకుముందు వస్తున్నప్పుడు చలికి జేబుల్లో చేతులు దూర్చితే
చల్లగా మంచుముద్దలా తగిలి చలి చురకవేసిందని
నేనే తీసి బయట పారేశాను దాన్ని
గులాబీలు నాకు యిష్టమైన పూలు.
నామిత్రుల జ్ఞాపకాలకు అవి తీపి గుర్తులు.
నా పుట్టిన రోజున నాకు వచ్చేబహుమతులు అవే.
అవే నా హృదయాన్ని దాచుకునే పూల భరిణులు.
అసలు విషయంకాస్త చిత్తగించండి మీరు.
ఈ విహారయాత్రకు వచ్చేముందు బడితోటలో
కొంటెగా కన్నుగీటిన గులాబీ మొదలువంచి
రహస్యంగా కోసి దాచుకున్న పువ్వు అది.

ఈ చేదుమాత్రను మింగలేదు రాజు.
మింగినా అతను వాంతి చేసుకుంటాడు.
నిజం తెలుసుకున్నందువల్ల అతనికి ఒరిగేదీ లేదు.
తెలుసుకోక పోయినందువల్ల నష్టమూ లేదు.
అందుకే అతనికి నేను నిజం చెప్పలేదు.

"ఈ పువ్వు పోగొట్టుకున్నవాళ్ళు పరాయివాళ్ళు కారు.
మన బృందంలోని వారు వినా మరొకరు కానేకారు.
ఇక్కడికి అరమైలుపైన ఉంటుంది ఊరు.
మైదానమే తప్ప యిటువైపు పంటభూమి లేదు.
ఏ పల్లెపడుచుకూ యిటు వచ్చే పనికూడా వుండదు.
పైగా ఆమె బంతిపువ్వేగాని గులాబీ తురమదు.
ఈ పువ్వు నిజంగా నాపాట వినవచ్చినవాళ్ళదే అనాలి.
అష్టపదుల్ని వినవచ్చిన ఆ అమ్మాయిది అక్షరాలా రసహృదయమే కావాలి"
రాజు ధోరణికి ఆనకట్ట వేయలేదు నేను.
అతని ఆలోచనల ప్రవాహంలో కొట్టుకుపోతున్నాడు పాపం! పాణి.

మెల్లగా కదిలి స్కూలు చేరుకున్నాం.
అవతలి వరండాలో వెన్నెల్లో ఆడాళ్ళు
చలికి ముడుచుకొనిపోయిన మల్లెలు.
ఇవతలి వరండాలో వెన్నెల వాలని చీకట్లో మగాళ్ళు
కలల్ని తిని మత్తుగా నిద్రపోతున్న గొంగళీ పురుగులు.
పాపం! మాకై ఎవరో అక్కడ పక్కలు పరిచివుంచారు.
వాటిపైకి చేరగానే మా చుట్టూ నిద్రతెరలు.

ఎప్పుడో తెలివి వచ్చేసరికి నా పక్కనే నిద్రలేపుతున్న రాజు.
“అంతా లేచిపోయారు, యింకా ఏమిటా గాఢనిద్ర
కలల్లోంచి పిలుచుకొస్తే క్షమించుగానీ నీకో మంచివార్త
ఈ రాత్రి అబ్బ! ఎంత తియ్యని కలకంటినోయి మిత్రమా.
ఏ దేవత దయదలచిందో గాని మరపురానిది ఈ రాత్రి.
నా జీవితానికి ఈ రాత్రి కలల పంటచాలు.
సరే. ఆ బద్దకాన్ని దుప్పట్లో మడతపెట్టి బయలుదేరు.
అలా చెరువువైపుపోతూ చెప్తాను కదులు”
—అంటూ భుజంపట్టి లేపదీసి, పక్కచుట్ట తనేచుట్టి
అతని ఉత్సాహపు ప్రవాహంలో పాణిసీ, నన్ను పూలికల్నిచేసి
రాత్రి వచ్చిన కలసాంతం మాముందు ఉంచాడు రాజు.

ఉహూఁ రాజు చెప్పిన కల మీకు చెప్పను.
అంత మంచి కథని పిట్ట కథ చేయను.
మరోసారి విడిగా ఓ ప్రేమ కథే చెప్తానులెండి.
అందాకా మీరు వేచి చూడండి; లేదా మర్చిపోండి.

కాల కృత్యాలు తీర్చుకొచ్చేసరికి భల్లున తూర్పు తెల్లవారింద.
అప్పటికి బస్సు బయలుదేరడానికి సిద్ధంగా ముస్తాబై వుంది.
బట్టల మీద రెపరెపలాడుతోన్న కొత్తరోజు చిగురుటెండలో
బస్సు బయట వెచ్చగా నుంచున్నారు మా వాళ్ళు.
పక్కచుట్ట తెద్దామని వరండా వైపుకదిలిన నా వెనకే
హడా విడిగా పరుగెత్తుకొచ్చాడు రాజు.

"ఇదో మిత్రమా! చూడు ఆ చివర మూడో అమ్మాయి
నాజూగ్గా బస్సుకు చేరబడి అటు తిరిగి మాట్లాడ్డంలేదూ
ఆమె వీపుమీద పాముల్లా వేలాడుతోన్న రెండు జడలుచూడు
అచ్చంగా అవి పడగెత్తిన నాగుబాములే కదూ
అదిగో ఆపడగమీద మాణిక్యంలా వదలిన ఓ గులాబీ
మరో పడగమీద ఏమీలేదు సరిగ్గా చూడు మరీ.
ఇప్పుడు తెలిసిందా రాత్రి ఆ అమ్మాయిదే హృదయం అక్కడ జారిపోయిందని
అందుకే ఆమె చూపులు చంచలమై కదులుతున్నాయి సుమీ"

రాజు కథలు రాయడుగానీ అతను కథకుడు.
అతనికి చక్కటి వర్ణనలుకూడా వొచ్చుమరి.
దారి పొడుగునా ఆ అమ్మాయి ఆకారంమీద అతనీ వ్యాఖ్యానాలు
అందుకు చక్కటి నిదర్శనాలు; అతని శక్తికి కొలబద్దలు
అతన్ని చూస్తే జాలికలుగుతోంది కదూ మీకు.
అవును; కలల్లో కల్పనల్లో తిరిగేవారు భూమ్మీద నడవలేరు.
నడిచినప్పుడు తూలిపడీ, జారిపడీ దెబ్బలు తగుల్చుకుంటారు
అందుకే నాకు నిజం చెప్పేయాలని వుంది.
కానీ యిప్పుడు చెప్పడానికి సమయం మించిపోయింది.
కలల్ని తినొద్దన్న ఆంక్ష ప్రపంచంలో ఎక్కడా లేదు.
కష్టపడి పనిచెయ్యమనే కమ్యూనిస్టు దేశాల్లోనే లేదు
మనది ప్రజాస్వామ్యం. పైగా యిక్కడ ఆకలి ఎక్కువ
కలల్నీ. కందమూలాల్నీ తినక తప్పదు.

పాణికి మాత్రం అసలు సంగతి చెప్పాను నేను.
ఆ అమ్మాయి వాళ్ళస్కూల్లో సైన్సుటీచరు రమాదేవి చెల్లెలట.
సరిగ్గా తెలీదుగానీ ఏదో కాలేజీలో చదువుతోందట.

మరో రాత్రి ఔరంగాబాదులో మజిలీ చేసి పొద్దున్నే ఎల్లోరాకు బయల్దేరి
నాలుగువైపులా కాంతి పరిమళాలను వెదజల్లుతూ
ఎల్లోరా రాళ్ళల్లో ఉదయం రేఖలు విచ్చుకొంటున్నవేళ—
తుమ్మెదల్లా ఎగురుతోన్న పిల్లగాలులు ప్రేమగీతాల్ని పాడుకొంటున్నవేళ—
మబ్బుల్లేని ఆకాశం ఉతికి ఆరేసిన బట్టలా మెరుస్తున్నవేళ—
మంచుతో కడిగిన రాళ్ళమీద సూర్యుడు రంగుల చిత్రాలు రచిస్తున్నవేళ
ఎల్లోరా కళా ప్రాంగణంలో అడుగుపెట్టాం.

ఎన్ని నిరీక్షణల నీళ్ళుపోయగా చివరికి ఈ కోరిక పండిందినాకు
ంతోషంతో మనసు రెక్కలాడించి పక్షిలా ఎగిరిపోయింది.
రకలు వేస్తున్న ఉత్సాహానికి దారులు వేస్తూ
ండరాళ్ళ పక్కగా కదిలి కైలాస దేవాలయంచేరి
రాళ్ళల్లో మేమూ రాళ్ళయిపోయాం.
మ్మల్ని మేమే మర్చిపోయాం.
ంతగొప్ప అనుభవాన్ని భరించలేని హృదయం నాది.
ల్ప సంతోషిని. ఈ అనుభవ ప్రభంజనానికి తట్టుకోలేని వాణ్ని.
ఈ రాళ్ళకు ప్రాణాలు పోసిన శిల్పులు యిప్పుడు లేరు గాని వుంటే
హృదయాన్నియిచ్చి 'మీ యిష్టం వచ్చినట్టు మలచుకోండి' అనేవాణ్ని
క్కడో నా మనసు లోతుల్లోపలి పొరలో సన్నని రేఖలా
ఈ జీవితాన్ని యిక్కడే పారేదామన్న కోరిక.

యి తగిలితూలి ఆలోచనల్లోంచిజారి చూస్తే అక్కడ ఎవరూ లేరు.
నా వాళ్ళ హడావుడి గుర్రాల రౌతులు, మందగమనం నచ్చనివాళ్ళు
మూలమాత్రం నాలాగే మరోలోకంలో నిలుచున్నాడు అంతర్ముఖుడు పాణి.
ఎవో మూల పుస్తకంలోంచి శిల్పాల్ని తిలకిస్తోన్నపాశ్చాత్యుడు
జు లేడు; పిలిచిన పిలుపుకి జవాబులేదు.
తను విడిచిన ఊపిరికూడా ఎక్కడా ఎగరడం లేదు.

ళ్ళలో రఘుణ్ని పేరు పేరునా పిలిచి పరామర్శించి
కొక్కక్క గుహనే మెల్ల మెల్లగా చూసుకుంటూ
హా కూడా మోసుకొచ్చిన పళ్ళమాటే మర్చిపోయి
నుభవాల్నే ఏరుకుని ఆకలిని తీర్చుకొని
చ్చివాళ్ళమై ఆ రాళ్ళలో తిరిగి తిరిగి
ళ్ళుమళ్ళీ మళ్ళీతిరిగి కాళ్ళరిగి
ూర్యుడు నిష్క్రమిస్తున్న వేళ రంగుల ఆకాశం క్రిందకూర్చుని
పీగా బత్తాయి పళ్ళు వొలుచుకొని తింటున్నప్పుడు
క్కడి నించో గాలి కెరటం ఒకటి సన్నని రాగాన్ని మోసుకొచ్చింది.
రాగం ఎవరిదో మాకు తెలుసు, ఇప్పుడు మీకుకూడా తెలుసు.
తన్ని వెతికి పట్టుకుని పాటలు పాడించుకుందామని
ద్రపోతోన్న రాళ్ళను రాగాలతో తట్టి లేపుదామని
ళ్ళను దాటుకొంటూ వెళ్ళబోతోన్న మాకు ఎదురుగ్గా
గా దూరంగా ఓ గుహలోంచి పాడుకొంటూ వస్తోన్న రాజు
తని ప్రక్కనే నమ్మలేని నిజంలా రమాదేవి చెల్లెలు!